సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



ఔను.. కలిసిపోతున్నారు

తగాదాలతో దూరమైన కుటుంబాలను ఒక్కటి చేయడమే లక్ష్యంగా సరూర్‌నగర్ మహిళా పోలీసులు కృషి చేస్తున్నారు. 10లో▸



ఇంటింటికీ అక్షింతలు

అయోధ్యలోని రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా అక్షింతలు పంపిణీ చేస్తున్నట్లు వీహెచ్‌పీ నేతలు తెలిపారు. 10లో▸



అక్రమ నిర్మాణాల తొలగింపు

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునగనూరు సర్వే నంబర్ 38లో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది తొలగించారు. 10లో▸

ఆ భూములపై ఆరా!

- పరిశ్రమలకు పెద్ద ఎత్తున భూములు కేటాయించిన గత ప్రభుత్వం
- ఆయా శాఖలు అనుమతిచ్చినా ఇప్పటికీ నెలకొల్పని సంస్థలు
- తక్కువ ధరకు భూములు పొందిన పారిశ్రామికవేత్తలు
- గడువు ముగిసినా.. పరిశ్రమలు నెలకొల్పని వాటిపై కొత్త సర్కార్ నజర్
- ఆయా ఖాళీ ప్లాట్లను వెనక్కి తీసుకోవాలని నిర్ణయం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పారిశ్రామికవాడల్లోని ఖాళీ భూములపై ప్రభుత్వం దృష్టి సారించింది. గత ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి చాలా తక్కువ ధరకు భూములు కొల్లగొట్టి నిర్దేశిత సమయం దాటిపోయిన తర్వాత కూడా సంస్థలను నెలకొల్పకుండా భూములను తమ అధీనంలో ఉంచుకున్న పారిశ్రామికవేత్తలపై ఆరా తీస్తోంది. ఆయా పారిశ్రామిక వాడల్లో ఖాళీగా ఉన్న భూముల వివరాలను సమర్పించాల్సిందిగా జిల్లా పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించడంతో ఇప్పటికే వారంతా ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి కల్పన పేరుతో గత ప్రభుత్వం పెద్ద ఎత్తున భూములు సేకరించింది. ప్రభుత్వ భూములతో పాటు రైతుల అధీనంలో ఉన్న అసైన్డ్, సీలింగ్ భూములను కూడా సేకరించింది. రైతులకు బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే చాలా తక్కువ నష్టపరిహారం చెల్లించింది. ఆయా పారిశ్రామికవాడల్లో భూములు కోల్పోయిన రైతులు ఇప్పటికీ తమ ఆందోళన కొనసాగిస్తూనే ఉన్నారు. ఖాళీగా ఉన్న ఈ భూములను స్వాధీనం చేసుకుని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ భూములు కేటాయించడం ద్వారా స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించొచ్చని భావిస్తోంది.

కోవిడ్ పేరుతో జాప్యం..

ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూముల కేటాయింపుపై ఆరా తీస్తోంది. జిల్లాలోని పారిశ్రామికవాడల వారీగా చేసిన ప్లాట్లు, కేటాయింపులపై దృష్టి సారించింది. నిజానికి ప్రభుత్వం నుంచి భూములు పొందిన రెండేళ్లలోనే పరిశ్రమలు నెలకొల్పాల్సి ఉంది. కోవిడ్ కారణంగా చాలా మంది పారిశ్రామిక వేత్తలు ఆయా భూముల్లో పరిశ్రమలను నెలకొల్పలేకపోయారు. కోవిడ్ ఉధృతి తగ్గిన తర్వాత కూడా పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా ఆయా పారిశ్రామిక వాడాల్లో సగానికిపైగా భూములు ఖాళీగా కన్పిస్తున్నాయి. కొంత మంది పరిశ్రమలు నెలకొల్పినప్పటికీ నష్టాల పేరుతో లాకౌట్ ప్రకటించారు. గేట్లకు తాళాలు వేసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఉదారంగా పొందిన భూములను మాత్రం తిరిగి రైతులకు ఇవ్వలేదు. ఆయా భూముల్లో సకాలంలో సంస్థలు నెలకొల్పి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉన్నా మెజార్టీ పారిశ్రామికవేత్తలు ఆ ఊసే ఎత్తడం లేదు.

వ్యాపార భాగస్వాములపై ఆరా..

శంషాబాద్ పారిశ్రామికవాడలోనే కాదు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని పలు పారిశ్రామిక వాడల్లోనూ ఇదే పరిస్థితి. పరిశ్రమల పేరుతో భూములు పొందిన వారు ఆయా భూముల్లో ఆ తర్వాత బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి, వ్యాపార సముదాయాలు నిర్వహిస్తుండటం విశేషం. 2015–16 ఆర్థిక సంవత్సరం నుంచి 2023 మార్చి వరకు టీఎస్‌ఐపాస్‌కు 1,589 దరఖాస్తులు రాగా, వీటిలో 1,171 పరిశ్రమలు మాత్రమే ఏర్పడ్డాయి. మిగిలిన సంస్థలు ఇప్పటికీ ఆయా భూముల్లో తట్టెడు మట్టి కూడా తీయలేదు. మరోవైపు ఇప్పటికే సంస్థలు నెలకొల్పి.. ఉత్పత్తులు ప్రారంభించిన సంస్థల్లోని వ్యాపార భాగ స్వాములపై కూడా ప్రభుత్వం ఆరా తీస్తున్నట్లు సమాచారం. మెజార్టీ సంస్థల్లో అప్పటి రాజకీయ ప్రముఖులు భాగస్వాములుగా ఉన్నట్లు భావిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఉపాధి, పెట్టు బడుల పేరుతో రైతుల నుంచి చౌకగా భూములు కొట్టేసి, ఆయా సంస్థల్లో వ్యాపార భాగస్వాములుగా ఉన్న నేతలను గుర్తించి, వారి వివరాలను బహిర్గతం చేయడం ద్వారా ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని ప్రజలకు వివరించాలని సర్కార్ ఆలోచనగా కనిపిస్తోంది.

జిల్లాలోని వివిధ పారిశ్రామిక వాడల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లు

ఇండస్ట్రియల్ పార్కు	మొత్తం విస్తీర్ణం	ప్లాట్లు	కేటాయించినవి	ఖాళీగా ఉన్నవి
మామిడిపల్లి హార్డ్‌వేర్ పార్కు	310 ఎకరాలు	74	74	-
ఫ్యాబ్‌సిటీ పార్కు	602 ఎకరాలు	171	126	45
ఆదిబట్ల ఐటీపార్కు	160.20 ఎకరాలు	12	10	02
ఆదిబట్ల ఏరోస్పేస్ సెజ్	339.10 ఎకరాలు	11	10	01
నాదర్‌గుల్ హార్డ్‌వేర్‌పార్క్	129.21 ఎకరాలు	101	97	04
మంఖాల్ ఇండస్ట్రియల్ పార్క్	107.12 ఎకరాలు	60	60	-
కాటేదాన్ పార్క్	245 ఎకరాలు	500	500	-
కొత్తూరు పార్క్	181.60 ఎకరాలు	88	88	-
హార్డ్‌వేర్‌పార్క్ ఫేజ్–2	250 ఎకరాలు	57	28	29
ఈఎంసీ మహేశ్వరం	340 ఎకరాలు	122	118	04
ప్లాస్టిక్‌పార్క్	179.32 ఎకరాలు	138	138	-
ఎంఎస్‌ఎంఈ ఇబ్రహీంపట్నం	129 ఎకరాలు	81	07	-
చందనవెల్లి పార్క్	1422.62 ఎకరాలు	945.17	-	-
ఆటోనగర్, హయత్‌నగర్	600 ఎకరాలు	1514	1514	-
మహేశ్వరం జనరల్ పాపార్క్	339.75 ఎకరాలు	122	119	03
కొంగరకలాన్ ఇండస్ట్రియల్ పార్క్	250 ఎకరాలు	1	-	
సిద్దాపూర్ పాపార్క్	314 ఎకరాలు	-	-	-
ఎలిమినేడు పార్క్	638.36 ఎకరాలు	-	-	-



రాచకొండ కోట ముఖ ద్వారం

సీఎం నోట.. రాచకొండ మాట

అభివృద్ధిపై చిగురించిన ఆశలు

మంచాల: సీఎం రేవంత్‌రెడ్డి నోట రాచకొండ గుట్టల ప్రస్తావన రావడం ఈ ప్రాంత అభివృద్ధిపై చర్చకు దారితీసింది. 2014 డిసెంబర్ 14న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రాచకొండ గుట్టలను సందర్శించారు. ఈ సందర్భంగా రాచకొండ చరిత్రను కాపాడుకోవడమే గాకుండా పర్యాటక కేంద్రంగా విరాజిల్లేలా సినీ హబ్‌ను ఏర్పాటు చేసి చిత్ర పరిశ్రమే ఇక్కడకు వచ్చేలా చూస్తామని అన్నారు. వివిధ పరిశ్రమలను ఏర్పాటు చేసి వెనుకబాటుకు గురైన ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో ఈ ప్రాంత అభివృద్ధిపై అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. తర్వాత ఈ హామీలు అమలుకు నోచుకోలేదు.

మరోసారి హాట్‌టాపిక్

ఇన్నాళ్లకు తిరిగి మరోసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోట రాచకొండ గుట్టల మాట రావడం హాట్ టాపిక్‌గా మారింది. 'రాచకొండ ప్రాంతంలో ప్రజలందరినీ మమేకం చేసి.. ఓ కొత్త నగరాన్ని నిర్మిస్తే ప్రకృతి అందాల మధ్య ఊటీని తలపిస్తుంది' అని పేర్కొనడంతో అభివృద్ధిపై మళ్లీ ఆశలు చిగురించాయి.

చరిత్రను కాపాడాలి



చారిత్రక రాచకొండ దేవాలయాలు, నిర్మాణాలను పరిరక్షించి చరిత్రను కాపాడాలి. పదేళ్లుగా రాచప్ప సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో దేవాలయాలను అభివృద్ధి పర్చడం, దూపదీప నైవేద్యాల నిర్వహణ చేస్తున్నాం. ఏటా వారోత్సవాలతో చరిత్రను వెలుగులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

– వెంకటేశ్, రాచప్ప సమితి ప్రధాన కార్యదర్శి

అభివృద్ధికి కృషి చేయాలి



రాచకొండ గుట్టలకు రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆ నాటి రేచర్ల పద్మ నాయకులు రాజధానిగా వెలిసిల్లిన పట్టణం ఇది. ఇక్కడ పురాతన కట్టడాలు ఉన్నాయి. వాటిని కాపాడడమే గాకుండా వనరులను సద్వినియోగం చేసుకొని ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలి.

– కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్, ఆరుట్ల

అభివృద్ధి పనులను ఆపొద్దు

- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గానికి సంబంధించి మంజూరైన రూ.470 కోట్ల అభివృద్ధి పనులను ఆపొద్దని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోరారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ 2023 జనవరి నుంచి నియోజకవర్గానికి వివిధ శాఖల ద్వారా రూ.470 కోట్లు మంజూరు చేయించానని తెలిపారు. వీటికి సంబంధించిన కొన్ని పనుల టెండర్లు పూర్తయ్యాయని, మరికొన్ని ప్రొసీడింగ్ దశలో ఉన్నాయని, పలు పనులు కొనసాగుతున్నాయని వివరించారు.

కోడ్ నేపథ్యంలో ఆగిన పనులు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ ప్రక్రియను నిలిపేశారని.. కోడ్ ముగిసినందున పనులను వేగిరం చేయాలని కోరారు. ఇందులో రోడ్ల వైడింగ్, డ్రైనేజీ, సీసీ రోడ్లు పెద్ద చెరువు సుందరీకరణ, అంబేడ్కర్ చౌరస్తా నుంచి అక్టోపస్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం, ఆయా మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు ఉన్నాయన్నారు. కొత్త ప్రభుత్వం వీటిని నిలిపేస్తోందంటూ సమాచారం ఉందని.. అలా చేయొద్దని కోరారు. రబీ సీజన్ పంటల సాగుకు ఇవ్వాల్సిన రైతుబంధు కోసం రైతులు ఎదురు చూస్తున్నారని, ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధిని పట్టించుకోకుండా పదేపదే అప్పులు చూపిస్తూ.. హామీల అమలు నుంచి తప్పించుకునేందుకు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

జానకమ్మకు నివాళి..

బీఆర్‌ఎస్ నాయకుడు మడుపు వేణుగోపాల్‌రావు తల్లి జానకమ్మ(89) అనారోగ్యంతో కన్నుమూసింది. ఖానాపూర్‌లో గురువారం జరిగిన అంత్యక్రియలకు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హాజరై జానకమ్మ మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరి, మండల అధ్యక్షుడు రాములు తదితరులున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలి

సాక్షి, సిటీబ్యూరో/బంజారాహిల్స్: అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో సాధించిన ఘన విజయం స్ఫూర్తితో త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. గురువారం సాయంత్రం బీఆర్‌ఎస్ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ కార్పొరేటర్లతో కేటీఆర్ సమావేశమై మాట్లాడారు. గ్రేటర్ పరిధిలో పార్టీ పటిష్ఠంగా ఉందని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ గులాబీ జెండాను ఎగరేసేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. అధికారంలోకి రాలేదని నిరాశ పడకుండా ప్రజల తరఫున ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటి వరకు మంత్రిగా బాధ్యతలు, తరచూ పర్యటనల కారణంగా మీతో సమావేశం కావడానికి తగినంత సమయం దొరకలేదని, ఇకపై ప్రతి నెలా సమావేశమవుతానన్నారు.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

మొయినాబాద్: మహారాష్ట్రలో ఈ నెల 24 నుంచి 29 వరకు జరగనున్న 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు చిలుకూరు గురుకులం విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల తొర్రూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో చిలుకూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు పతకాల పంట పండించారు. 42 కిలోల విభాగంలో కె.భరత్, 56 కిలోల విభాగంలో పి.చిరంజీవి, 81 కిలోల విభాగంలో కె.అశ్విన్ బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 40 కిలోల విభాగంలో ఎస్.సువాసన్, 52 కిలోల విభాగంలో ఎన్.రాజేష్, 63 కిలోల విభాగంలో ఎస్. విష్ణువర్ధన్ వెండి పతకాలు, 46 కిలోల విభాగంలో కె.విగ్నేష్, 44 కిలోల విభాగంలో పి.రిషికపూర్, 50 కిలోల విభాగంలో పి.సాయి సిద్ధార్థ కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆర్‌సీఓ శారద, పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ శౌరిరాజ్, పీడీ ఆదిబాబు, పీఈటీ, బాక్సింగ్ కోచ్ శ్రీకాంత్ అభినందించారు.

పంటల వివరాలు పక్కాగా నమోదు చేయాలి



షాబాద్‌లో పంటల వివరాలను నమోదు చేస్తున్న జిల్లా వ్యవసాయాశాఖ అధికారి

షాబాద్: యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను పక్కాగా నమోదు చేయాలని వ్యవసాయ విస్తీర్ణ అధికారులను జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి ఆదేశించారు షాబాద్ క్లస్టర్‌లో యాసంగి సీజన్‌కు సంబంధించిన పంటల నమోదు ప్రక్రియను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను పక్కాగా నమోదు చేయాలని వ్యవసాయ విస్తీర్ణ అధికారులను ఆదేశించారు. ఇప్పుడు వరి నార్లు పోసుకునే సమయమని, నారుమడి యాజమాన్యంపై రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున రాత్రి పూట నారుమడిలో నీరు తొలగించి మరునాడు ఉదయం కొత్తనీరు పెట్టుకోవాలన్నారు.నారుమడిలో ఇనుము,జింకు లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటేశం, ఏఈఓ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గోల్ఫ్ కార్ట్ బ్యాటరీ వాహనాల అందజేత



గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్‌లో 1,600 రకాల జాతుల మొక్కలు ఉన్నాయని, మరో 400 రకాల జాతి మొక్కలను నాటేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు టీఎస్‌ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోన్ సీజీఎం భాస్కర్ రావు రెండు గోల్ఫ్ కార్ట్ బ్యాటరీ వాహనాలను ఎండీ చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొటానికల్ గార్డెన్‌లో 1600 రకాల మొక్కలు ఉన్నాయని, పాఠశాల, కళాశాలల విద్యార్థులకు వృక్ష పరిచయం చేసేందుకు గోల్ఫ్ కార్ట్ బ్యాటరీ వాహనాలు అవసరమన్నారు. కాక్టస్ గార్డెన్, హెర్బల్ మెడిసినల్ గార్డెన్, క్లైంబర్స్, క్రీపర్స్, నక్షత్ర వనం, నవగ్రహ వనం, రాసి వనం, మ్యూజికల్ ట్రీ గార్డెన్, బటర్‌ఫ్లై గార్డెన్, కీటక ఆహార వనాలను చూసేందుకు నిత్యం వెయ్యి మందికి పైగా సందర్శకులు వస్తారని పేర్కొన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం శ్రీనివాస్ రావు, సీనియర్ మేనేజర్ శివ కుమార్, సుమలత, టీఎస్‌ఎఫ్‌డీసీ డైరెక్టర్ అక్బర్, జీఎం సైకిలాబ్ తదితరులు పాల్గొన్నారు.

బషీర్‌బాగ్‌లో సీపీ క్యాంప్

పాత కమిషనరేట్ భవనం వినియోగం

- వారంలో రెండు రోజులు ఇక్కడే కొత్వాల్
- త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు



సాక్షి, సిటీబ్యూరో: నగరవాసులకు మరింత అందుబాటులోకి రావడం కోసం పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. బషీర్‌బాగ్ చౌరస్తాలో ఉన్న పాత కమిషనరేట్ భవనాన్ని తన క్యాంపు కార్యాలయంగా మార్చుకోనున్నారు. ప్రతి వారం కనీసం రెండు రోజుల పాటు ఇక్కడ అందుబాటులో ఉండనున్నారు. త్వరలో దీన్ని అమలులోకి తీసుకురావడానికి కొత్వాల్ సన్నాహాలు చేస్తున్నారు. కమిషనరేట్ పాతబస్తీలోని పురానీ హవేలీ ఉన్నప్పుడు తప్ప నగర పోలీసు కమిషనర్‌కు క్యాంపు కార్యాలయం ఉండేది. బషీర్‌బాగ్‌లో కమిషనరేట్ ఉన్నంతం కాలం పురానీ హవేలీని క్యాంప్ ఆఫీస్‌గా వినియోగించుకున్నారు. దాదాపు ప్రతి శుక్రవారం, కీలక సందర్భాల్లో పోలీసు కమిషనర్లు అక్కడే ఉండేవారు. గతేడాది సీపీ కార్యాలయం బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లోకి (టీఎస్ ఐసీసీసీ) మారింది. అదే సమయంలో పురానీ హవేలీకి మరమ్మతులు ప్రారంభమయ్యాయి. దీంతో నాటి నుంచి కొత్వాల్‌కు క్యాంపు కార్యాలయం లేకుండాపోయింది.

వ్యయ ప్రయాసల నివారణకు..

బంజారాహిల్స్ రోడ్ నెం.12లో టీఎస్ ఐసీసీసీ భవనంలోని టవర్ ఏలో ఉన్న 18వ అంతస్తులో పోలీసు కమిషనర్ ఛాంబర్ ఉంది. ఈ ప్రాంగణానికి చేరుకోవడానికి సాధారణ ప్రజలు, బాధితులు అనేక వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. మరోపక్క ఇందులోనే సైబర్ సెక్యూరిటీ బ్యూరో, నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌లతో పాటు మరికొన్ని కీలక కార్యాలయాలు ఉన్నాయి. దీంతో సామాన్య ప్రజలు ఇందులోకి ప్రవేశించడానికి కొన్ని అనుమతులు తీసుకోవాల్సి రావడం వారికి ఇబ్బందులు కలిగిస్తోంది. ఈ విషయాలను గమనించిన కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. నాంపల్లి ఉండే సెంట్రల్ క్రైమ్ స్టేషన్, సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్, డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్స్ బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్‌కు మారాయి. అయినప్పటికీ ఐదో అంతస్తులో ఉన్న పోలీసు కమిషనర్ ఛాంబర్ అలాగే ఉంది. గణేష్ సామూహిక నిమజ్జనంతో పాటు ఇతర సందర్భాల్లో పోలీసు కమిషనర్ ఇక్కడ నుంచే పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం అక్కడే తన క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయడానికి కొత్వాల్ నిర్ణయించారు. ప్రతి వారం కనీసం రెండు రోజుల పాటు ఈ క్యాంప్ ఆఫీస్‌లోనే అందుబాటులో ఉండనున్నారు.

పత్తి పతనం

- సకాలంలో కురవని వర్షాలు
- ఈ ఏడాది తగ్గిన దిగుబడి
- ప్రభుత్వ 'మద్దతు' అంతంతే..
- బహిరంగ మార్కెట్‌లో స్పందన కరువు
- ఆందోళనలో రైతులు
- జిల్లాలో 1,32,523 ఎకరాల్లో సాగు



చేవెళ్ల మండలంలో రైతులు సాగు చేసిన పత్తి

చేవెళ్ల: తెల్లబంగారంపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈసారి పత్తి గట్టెక్కిస్తుందనుకున్నారు. కానీ సకాలంలో వర్షాలు కురవకపోవడంతో సాగు చేసిన పంట దిగుబడిపై ప్రభావం చూపించింది. దీంతో ఆశించిన స్థాయిలో ఆదాయం వచ్చేలా లేదని రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ఈ ఏడాది క్వింటాలుకు రూ.7,020గా నిర్ణయించింది. బయట ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుందామనుకున్నా రూ.6,800 మాత్రమే పలుకుతోంది. చేసేది లేక ప్రభుత్వ మద్దతు ధరకే అమ్ముకునేందుకు మొగ్గు చూపిస్తున్నారు. కనీసం దిగుబడి ఎక్కువగా వచ్చినా లాభం చేకూరేదని వాపోతున్నారు.

దెబ్బ తీసిన వానలు

జిల్లాలో ఎక్కువగా కూరగాయలతోపాటు వాణిజ్య పంటలైన పత్తి, మొక్కజొన్న సాగు చేస్తుంటారు. ఈఏడాది రైతులు ఎక్కువగా పత్తిపై దృష్టి సారించారు. చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కందుకూరు, రాజేంద్రనగర్ డివిజన్లలోని మండలాల్లో 1,32,523 ఎకరాల్లో సాగు చేశారు. సాధారణ సాగు విస్తీర్ణం 1,87,200 ఉండగా అధికారులు దాదాపు 1.99 లక్షల ఎకరాలు సాగవుతుందని అంచనా వేశారు. వాస్తవంగా రైతులు సాగు చేసింది 1,32,523 ఎకరాలు మాత్రమే. ఈ ఏడాది వాతావరణం ప్రారంభంలో వర్షాలు సక్రమంగా లేకపోవడంతో సాగు ఆలస్యమైంది. సాగు చేసిన తరువాత మధ్యలో పంటల ఎదుగుదల, కాత దశలో వానలు దెబ్బతీశాయి.

జిల్లాలో ఎక్కడైనా అమ్ముకునే అవకాశం

రైతులు సాగు చేసిన పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినందున వారికి అనుకూలంగా ఉన్న జిన్నింగ్ మిల్లులో ఎక్కడైనా అమ్ముకునేందుకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈసారి జిల్లాలో 12లక్షలకు పైగా క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. దీనికి తగినట్లు తొమ్మిది జిన్నింగ్ మిల్లుల ద్వారా సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు ప్రారంభించారు. మరోవైపు గతేడాది బయట మార్కెట్‌లో పత్తికి ఎక్కువ ధర పలికితే ఈఏడాది మద్దతు ధరకంటే తక్కువగా పలుకుతోంది. ప్రభుత్వం మద్దతు ధర పెంచాలని రైతులు కోరుతున్నారు.

మంచి ధర వస్తే బాగుండు



ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. మంచి దిగుబడి వస్తుందని ఆశించా. సకాలంలో వర్షాలు లేకపోవడంతో పంట దిగుబడిపై ప్రభావం పడింది. కనీసం వచ్చే దిగుబడికైనా మంచి ధర లభిస్తే బాగుంటుంది.

– వై. శ్రీనివాస్, రైతు, చేవెళ్ల

నల్లరేగడి భూముల్లో బాగానే ఉంది



నల్లరేగడి భూముల్లో వేసిన పంటలు పరవాలేదు. ఇతర భూముల్లో వేసిన పత్తి దిగుబడులపై ప్రభావం ఎక్కువగా పడింది. జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. రైతులు నేరుగా అక్కడే అమ్ముకోవచ్చు.

– రమాదేవి, ఏడీఏ, చేవెళ్ల

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సేవా ప్రముఖ్ బండారి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న బండారి రమేశ్

షాద్‌నగర్: అయోధ్యలోని శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇంటింటికి అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సేవా ప్రముఖ్ బండారి రమేశ్ తెలిపారు. గురువారం పట్టణంలోని పతంజలి యోగా కేంద్రంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ఆధ్వర్యంలో పూజిత అక్షింత వితరణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోధ్యలో ఆలయ నిర్మాణం హిందువుల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. అక్షింతల ఊరేగింపు కార్యక్రమం దేశ వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు గడపగడపకూ అయోధ్య పూజిత అక్షింతల వితరణ ఉంటుందన్నారు. ఈ మహా కార్యక్రమంలో హిందూ బంధువులందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రాంత ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, వసంత వెంకటేశ్, రాచయ్య, చెట్ల వెంకటేశ్, బండి కిరణ్, ప్యాట వంశీ, బాలబ్రహ్మచారి, గిరి, రమేశ్, డిస్కో శ్రీనివాస్, శేఖర్, వీరప్ప, హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ తీయలేదని..

దుండిగల్: ట్యాంకర్‌కు అడ్డుగా ఉన్న బైక్‌ను తీయడానికి నిరాకరించిన యువకుడిపై దాడి చేయడంతో యువకుడు మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగద్గిరిగుట్టకు చెందిన నాగశివ(29) క్యాటరింగ్ పనులు చేస్తుంటాడు. ఈ నెల 20న పని ఉండడంతో బైక్‌పై డి.పోచంపల్లి కృష్ణానగర్‌లో ఉంటున్న సహచరుడి వద్దకు వెళ్లారు. అతని ఇంటి పక్కనే బైక్‌ను పార్క్ చేసి వేచి చేస్తున్నారు. అదే సమయంలో కృష్ణానగర్‌కు చెందిన అనుశ్ సెప్టిక్ ట్యాంకర్‌కు అడ్డుగా పెట్టిన బైక్‌ను తీయాలని కోరగా, వారు నిరాకరించారు. దీంతో అనుశ్ తన అనుచరులతో కలిసి దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన నాగశివ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఔను.. కలిసిపోతున్నారు

విడిపోదామనుకుని.. ఒక్కటవుతున్న జంటలు

- చిన్న చిన్న అంశాలకే మనస్పర్థలు, గొడవలు
- వేధిస్తున్నారంటూ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు
- దంపతులకు కౌన్సెలింగ్.. ఒక్కటవుతున్న భార్యాభర్తలు



సరూర్‌నగర్ మహిళా పోలీస్‌స్టేషన్

హుడాకాంప్లెక్స్: క్షణికావేశంలో దంపతుల మధ్య మనస్పర్థలు.. తగాదాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటూ ఉన్న కుటుంబాలను ఒక్కటి చేయడమే లక్ష్యంగా సరూర్‌నగర్ మహిళా పోలీసులు కృషి చేస్తున్నారు. రామకృష్ణాపురానికి చెందిన ఓ యువ జంట మధ్య మనస్పర్థలు తలెత్తాయి. అది కాస్తా పెరిగి పెద్దదై చివరకు విడాకుల వరకు వెళ్లింది. ఇరువురు సరూర్‌నగర్ మహిళా పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు దంపతులిద్దరిని కూర్చోబెట్టి కౌన్సెలింగ్ ఇచ్చారు. శాశ్వతంగా విడిపోదామనుకున్న వారు ఒక్కటవుతున్నారు. హస్తినాపురానికి చెందిన సాఫ్ట్‌వేర్ దంపతులు. పిల్లల పెంపకం విషయంలో ఇద్దరు గొడవపడ్డారు. పెద్దలు నచ్చజెప్పినా వినిపించుకోలేదు. శాశ్వతంగా విడిపోయేందుకు నిర్ణయించుకున్నారు. భర్త వేధిస్తున్నాడని భార్య... కాదు భార్యే తనను వేధిస్తుందని భర్త ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు ఇద్దరిని కూర్చోబెట్టి ఒకటికి రెండుసార్లు కౌన్సిలింగ్ ఇవ్వడంతో ఒక్కటయ్యారు. ఇలా ఒకటి కాదు... రెండు కాదు ఏకంగా 1799 జంటలను కలిపారు.

2649 ఫిర్యాదులు

అదనపు కట్నం కోసం, పిల్లల పెంపకంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, సంపాదన లేదని, మందు తాగుతున్నాడని.. ఇలా వివిధ కారణాలతో ఘర్షణ పడుతున్నారు. వేద మంత్రాల సాక్షిగా ఒక్కటైన యువ జంటలు చిన్న చిన్న అంశాలను పెద్దగా భావించి ఎడబాటును కొని తెచ్చుకుంటున్నారు. కక్ష్యసాధింపు చర్యల్లో భాగంగా ఒకరిపై మరొకరు కేసులు నమోదు చేసుకుంటున్నారు. ఇలా ఈ ఏడాది 2023లో 2649 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఎఫ్ఐఆర్‌కు ముందే పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. విడిపోదామనుకున్న వారు కౌన్సెలింగ్ తో మనసు మార్చుకుంటున్నారు. ఇలా ఈ ఏడాది 1799 జంటలు ఒక్కటయ్యారంటే ఆశ్చర్యం వేయకమానదు. 552 కేసుల్లో ఎఫ్ఐఆర్ చేసినట్లు సమాచారం.



కౌన్సెలింగ్ ఇస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ ముఖేష్‌బాబు

సహనం కావాలి...



రోజుకు 10–15 యువ దంపతుల నుంచి ఫిర్యాదులు వస్తుంటాయి. సంసారంలో సహనం లేక వివాహమైన రెండు మూడేళ్లకే గొడవపడుతుంటారు. ఒకరిని ఒకరు అర్థం చేసుకోక క్షణికావేశంలో జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఆగ్రహంగా వచ్చిన వారు కూడా నచ్చజెప్పడంతో 70 శాతం జంటలు ఒక్కటై వెళ్తుంటారు. కౌన్సిలింగ్ ఇచ్చినా మొండిగా వ్యవహరించే వారిపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తాం. సాధ్యమైనంత వరకు జంటలను కలిపేందుకే కుటుంబసభ్యులను స్టేషన్‌కు పిలిపిస్తుంటాం.

– పి.సురేఖ, సీఐ మహిళా పోలీస్‌స్టేషన్, సరూర్‌నగర్

తల్లి, కుమారుడు అదృశ్యం



అదృశ్యమైన తల్లి, కొడుకు(ఫైల్)

పహాడీషరీఫ్: మూడేళ్ల కుమారుడితో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాహిన్‌నగర్ హబీబ్ కాలనీకి చెందిన సయ్యద్ హమీద్, సీమాబేగం (28)లు భార్యాభర్తలు. ఈ నెల 6వ తేదీనా సాయంత్రం భర్త ఇంట్లో లేని సమయంలో సీమాబేగం తన చిన్న కుమారుడు సయ్యద్ మహ్మద్(3)తో కలిసి బయటకు వెళ్లిపోయింది. సీమాబేగం నిజామాబాద్‌లో ఉండే దూరపు బంధువు షేక్ సాజిద్‌తో తరచూ ఫోన్ మాట్లాడేదని, అదృశ్యానికి అతడే కారణమంటూ భర్త గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62366 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

వివాహిత మిస్సింగ్



రమ్య(ఫైల్)

కడ్తాల్: వివాహిత అదృశ్యమైన ఘటన కడ్తాల్ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం వెలుగుచూసింది. ఎస్ఐ హరిశంకర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చరికొండ గ్రామానికి చెందిన పోలే రమ్య(25), మహేశ్ భార్యాభర్తలు, వారికి కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబంలో జరిగిన గొడవల కారణంగా, పోలే రమ్య మనస్తాపంతో గత నెల నవంబర్ 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పిల్లలను వదిలేసి వెళ్లిపోయింది. భర్త మహేశ్‌కు, భార్య రమ్య కనిపించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి



కృష్ణకుమార్‌గౌడ్ (ఫైల్)

పూడూరు: రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ దుర్ఘటన చన్గోముల్ పీఎస్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కండ్లపల్లి గ్రామానికి చెందిన జి.కృష్ణకుమార్ గౌడ్ చేవెళ్ల మండలం ఆలూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకుని మన్నెగూడ వైపు ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో కండ్లపల్లి గేటు సమీపంలో ఎదురుగా స్టీల్ లోడ్ వస్తున్న డీసీఎం ఢీకొట్టడంతో ప్రమాద స్థలిలో ప్రాణాలొదిలాడు. మృతుడికి భార్య, కుమారుడు న్నారు. భార్య హంస వేణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘరానా దొంగ అరెస్ట్

ముషీరాబాద్: ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగను ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా, తాళ్లూరుకు చెందిన రాయపాటి వెంకటరావు(51) నిజాంపేట్‌లోని పీపీఆర్ హోమ్స్‌లో నివాసం ఉంటున్నాడు. చోరీలనే వృత్తిగా ఎంచుకున్న అతడిపై ఎస్ఆర్‌నగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ తదితర పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయి. గత నెల 28న ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మి అనూష అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న డెబోరా ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 23.2 తులాల బంగారు నగలు, రూ.93 వేల నగదు, మూడు ఏటీఎం కార్డులు చోరీ చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన ఎస్సై చలపతిరెడ్డి సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడు రాయపాటి వెంకటరావును అరెస్టు చేశారు. అతడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేస్తున్న అధికారులు

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం మునుగనూరులోని సర్వే నంబర్ 38లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను గురువారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బోడ భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో నిర్మాణాలను పరిశీలించి, అక్రమ నిర్మాణాలుగా గుర్తించి వాటిని పోలీసులు, జేసీబీ సహాయంతో కూల్చి వేశామని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది కొరత కారణంగా అక్రమ నిర్మాణాలు గుర్తించడంలో జాప్యం జరుగుతుందన్నారు. ప్రభుత్వ భూమిని రక్షించేందుకు అక్రమార్కులపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హయత్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

దారి దోపిడీకి యత్నం

- ఇద్దరు యువకుల అరెస్ట్
- మారణాయుధాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు

మైలార్‌దేవ్‌పల్లి: దారి దోపిడీకి పథకం పన్నిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది .సీఐ మధు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..గంజాయి సరఫరా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో బుధవారం లక్ష్మిగూడ వాంబేకాలనీ రోడ్డులో శంషాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లు లింగయ్య, హరినాథ్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకును అనుమానంతో ఆపడానికి యత్నించగా, వారు తమ వద్ద నున్న పెప్పర్ స్ప్రే బాటిల్‌తో పోలీసులపై స్ప్రే చేసి బైక్‌ను అక్కడే వదిలి పరారయ్యారు. కానిస్టేబుళ్లు ఈ ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. మైలార్‌దేవ్‌పల్లి ఇన్ స్పెక్టర్ మధు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వారు వదిలి వెళ్లిన బైక్ నంబర్ ఆధారంగా నిందుతులను అదుపులోకి తీసుకున్నారు.వారి నుంచి రెండు స్టీల్ కత్తులు, డమ్మీ పిస్టల్ ,రెండు చిల్లీ స్ప్రే బాటిళ్లు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితులు ఫలక్‌నుమాకు చెందిన ఖారింఖాన్ మోతిజైన్, మతిన్ ఖాన్ (23గా గుర్తించారు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు ఇరువురు సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్లే వారిని బెదిరించి డబ్బులు లాక్కోవాలని పథకం పన్నినట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య



నాగచక్రపాణి(ఫైల్)

గచ్చిబౌలి: ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జేమ్స్ బాబు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా, బత్తలూరు గ్రామానికి చెందిన దంపతులు గజ్జల నాగశేషులు, రామలక్ష్మమ్మ దంపతుల కుమారుడు గజ్జల నాగచక్రపాణి(28) ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ గచ్చిబౌలిలోని పీజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. రెండు రోజులుగా ఆఫీసుకు సెలవు పెట్టి గదిలోనే ఉన్నాడు. బుధవారం మధ్యాహ్నం హాస్టల్ వద్దకు వచ్చిన శివ నాగరాజుతో మాట్లాడిన అనంతరం గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. సాయంత్రం డ్యూటీ నుంచి వచ్చిన రూమ్మేట్ వేణుగోపాల్ రెడ్డి ఎంత పిలిచినా స్పందించలేదు. హాస్టల్ నిర్వాహకులతో కలిసి కిటికీలోంచి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు బెడ్ షీట్‌తో ఉరి వేసుకుని కనిపించాడు. గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రేమ విఫలం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అవమానించేలా ప్రవర్తించడం సిగ్గుచేటు

బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి జనార్దన్‌రెడ్డి



చేవెళ్లలోని ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల: పార్లమెంట్ ఆవరణలో బుధవారం ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్‌ని మిమిక్రీ చేస్తూ వెక్కిరించిన టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ, దీనిని సమర్థిస్తూ వీడియో తీసిన కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చర్యలు ఆయనను అవమానించేలా ఉన్నాయని తము తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి బి.జనార్దన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గురువారం ఈ ఘటనకు నిరసనగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రధాన మంత్రి అభ్యర్థిగా చెప్పుకునే రాహుల్‌గాంధీ తీరును తీవ్రంగా వ్యతిరేకించారు. భారత ఉప రాష్ట్రపతిని గౌరవించాల్సిన సభ్యులు, పార్లమెంట్ ఆవరణలోనే ఆయనను అవమానించేలా ఆయనను అనుకరిస్తూ మిమిక్రీ చేయటం సిగ్గుచేటని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ దేశ ప్రజలకు, ఉప రాష్ట్రపతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు జంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు విఠల్‌రెడ్డి, రాము, మండలపార్టీ ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణాగౌడ్, దళిత మోర్చా అధ్యక్షుడు అశోక్, టౌన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు జయసింహ, నవీన్, వడ్డే గణేశ్, షాబాద్ మండల నాయకులు మహేశ్, తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం కొంటే సీజ్ చేస్తాం



రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న రఘునందన్

కందుకూరు: మిల్లర్లు రేషన్ బియ్యం కొంటే మిల్లులను సీజ్ చేస్తామని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఎం.రఘునందన్ పేర్కొన్నారు. గురువారం కందుకూరులో ఆయన రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైస్ మిల్లర్లు కొంటున్నా వడ్లకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు సంబంధిత నమూనాలో పొందుపరచాలన్నారు. కొందరు మిల్లర్లు రేషన్ బియ్యం దందా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయన్నారు. రేషన్ బియ్యం కొంటున్నారని తేలితే మిల్లులు సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

గంజాయి పట్టివేత

5.2 కేజీలు స్వాధీనం

యువకుడు అరెస్టు



గంజాయితో నిందితుడు

ఇబ్రహీంపట్నం రూరల్: అక్రమంగా ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తుండగా మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ఓటీ సీఐ రవికుమార్ వివరాల ప్రకారం.. అక్రమంగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో గురువారం సాయంత్రం వండర్‌లా సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఒడిశాకు చెందిన మహానంద మిస్త్రీ (18) నగరంలోని కోకాపేట్‌లో కూలీ పనులు చేసుకుంటూ గడుపుతున్నాడు. ఒడిశాలో కేజీ రూ.1000 కొనుగోలు చేసి హైదరాబాద్‌లో రూ.5వేలకు అమ్ముతుంటాడు. పోలీసులు అతడిని పట్టుకుని 5.2 కేజీల గంజాయి, సెల్ ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒడిశాలో గంజాయి అమ్మిన సోమంత్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు.